

# తీర్థయాత్ర (టాంజానియా ట్రావెలాగ్)

## గొల్లపూడి మారుతీరావు



*(గతసంచిక తరువాయి)*

6

ఉదయం కాఫీ తాగుతూనే ఆరుగంటలకే బయలుదేరిపోయాం మికూమీ పార్కుకి. జంతువులు బయటికి వచ్చి జీవనం ప్రారంభించే వేళలు ఉదయం, సాయంకాలం. ఈ పార్కుల్ని సందర్శించడానికి డబ్బు చెల్లించాలి. ఈ దేశం ఆదాయంలో ఇది ముఖ్యమైనది. లోనికి వెళ్ళే వాన్ నంబరు, ఎంతమంది వెళ్ళేదీ, డ్రైవరు, గైడ్ పేర్లు - ఇవన్నీ రాసి ఇవ్వాలి. వెళ్ళేది అడివిలోకి, క్రూరమృగాల మధ్యకి. కనుక తిరిగి వచ్చే ముందు శాల్తీలన్నీ క్షేమంగా వచ్చిందీ లేనిదీ చూస్తారు.

వచ్చింది అడివిలోకి - పార్కు ముఖద్వారం నుంచే చిన్న చలి కితకితలు పెట్టడం ప్రారంభించింది.

అప్పుడే అరణ్యం మేలుకుంటోంది. జంతువులకి ఒకటే యావ - ఆహారం, విహారం. అందుకనే ఈ రెంటికీ మాత్రమే పరిమితమైన మానవుడు జంతువు కిందే లెక్క.. ఇంతకు మించినదేదో సాధించగలిగే శక్తి, ఆలోచన మానవునికి భగవంతుడు ప్రసాదించాడు. అదేమిటో తెలియని వారికి తమ జీవితాలను సుభాషితాలుగా మార్చిన మహాత్ముడు, మదర్ థెరిస్సా వంటి దేవతల్ని ప్రసాదించాడు.

మికుమి ముఖ ద్వారం దాటుతూనే ఏనుగుల కుటుంబం తొండాలు ఎత్తి మాకు స్వాగతం పలికాయి. ఎండ లేస్తున్న కొద్దీ వాతావరణం వేడెక్కింది. పార్కునిండా పరచుకున్న రెల్లు - దాన్ని సెవాన్నా గడ్డి అంటారు. ముఖ్యంగా సింహాలు ఈ గడ్డిలో తల దాచుకుంటే - అవి కదిలితే తప్ప గుర్తు పట్టడం కష్టం. లాండ్ రోవర్‌లో జంతువుల్ని వాన్‌లో ఉండే చూడటానికి మీద టాపు తెరచుకుంటుంది. ఈ పార్కుల్లో జంతువుల్ని హాయిగా, క్షేమంగా చూడాలన్నా, ఫొటోలూ, వీడియోలూ తీసుకోవాలన్నా ఈ ఏర్పాటు చాలా సౌకర్యంగా ఉంటుంది. గైడ్ బెనెడిక్ట్ కళ్ళు చెట్ల మధ్యనుంచీ దూసుకుని చూస్తున్నాయి. జంతువుల్ని గుర్తుపట్టగలగడం, ఎక్కడ ఉంటాయో ఊహించగలగడం వారికి అలవాటు.

ఈ పార్కుల్లోకి వచ్చేవారి మొదటి కల - సింహాల్నీ, చిరుత పులుల్నీ చూడటం. నాలుగయిదు మలుపులు తిరిగిన అరగంటకే బెనెడిక్ట్ అరిచాడు - "దూరంగా రెల్లు వెనుక సింహం!!" అంటూ, ప్రసాదరావుగారు వీడియో తీసి 'జూమ్' చేశారు, "అది సింహం కాదు - దుమ్మలగొండి" అని తేల్చారు. బెనెడిక్టు సందేహంలో పడ్డాడు. మరొక పక్క నక్క పరిగెడుతోంది. మీద రాబందులు ఎగురుతున్నాయి. ఇవన్నీ ఒకే ఒక్క విషయాన్ని సూచిస్తాయి. దగ్గర్లో సింహం ఉంది. ఏదో జంతువుని వేటాడి ఉంటుంది.

మరో 40 గజాల దూరంలో 'హిప్పో పూల్' (హిప్పోలు ఉండే చిన్న చెరువు) ఉంది. దానికి 20 గజాల ముందుగానే సింహం కనిపించింది. మేం నలుగురం తుళ్ళిపడ్డాం. టాంజానియాలో ఆసక్తి గొలిపే మొదటి దృశ్యమిది. కేవలం పది నిమిషాలముందు ఓ అడివి దున్నని (wild beest) వేటాడి - పొట్ట చీల్చి తీరుబాటుగా సేవిస్తోంది - శివంగి. వాన్ మరి కాస్త ముందుకి వెళ్ళింది. అనుభవం లేక



మాకు కాస్త కాళ్ళు వణికాయి. నేను అక్కడినుంచే ఇండియాలో మా అబ్బాయికి ఫోన్ చేశాను. అంతలో మరో పది గజాల దూరంలో విశ్రమిస్తున్న మరో శివంగి కనిపించింది. మా ఉత్సాహానికి అవధిలేదు.

నిర్మలమయిన ఆ ఉదయపు వేళ ఓ అడివి దున్నని ఫలహారం చేస్తోంది శివంగి. కాసేపటి కిందటి వరకూ తమతో ఉన్న అనుచరుణ్ణి నష్టపోయిన - మిగతా అడవి దున్నలు దూరం నుంచీ బీరు పోయి చూస్తూ నిలబడిపోయాయి. మరికాస్త దూరంలో ఈ మారణ కాండని గమనిస్తున్న చారల గుర్రాల గుంపులు. వాటిలో చలనం లేదు. ప్రకృతి ఒక్క క్షణం నిశ్చేష్టమయిపోయింది. జంతువులకి ఆలోచన ఉండకపోవచ్చు. కానీ instinct ఉంటుంది. తమ కళ్ళముందే మరొక జంతువుకి ఆహారమయిన సాటి ప్రాణి పట్ల వాటిలో స్పదన స్పష్టంగా తెలుస్తోంది.

ఇది సృష్టి వైచిత్రి. సింహానికి ఇది ఆహారం. అడివి దున్నకి ప్రాణం. సింహం తిని వదిలేశాక - మిగతా మాంసాన్ని తినడానికి - దగ్గరికి వచ్చే ధైర్యం లేనిదుమ్మలగొండి, నక్కలు ఎదురు చూస్తున్నాయి. మరొక పక్క వందపైగా రాబందులు. అందరికీ, అన్నిటికీ ఇది ఆహారం, రాబందుల్ని scavangers అంటారు. అంటే అవశేషాల్ని తుడిచిపెట్టే ప్రాణులు సాయంకాలానికి చచ్చిన ప్రాణి ఎందరో కడుపులు నింపుతుంది. ఇంకా మిగిలిన అవశేషాల్ని కోట్లాది సూక్ష్మ క్రిములు ఫలహారం చేస్తాయి. భూమిసారాన్ని ఈ క్రిములు పెంచుతాయి. కొన్ని కోట్ల సంవత్సరాలుగా సృష్టిలో సాగుతున్న 'వలయం' (food cycle) ఇది. ఎంత జీవన వైవిధ్యం! సృష్టిలో సహజమయిన ఏర్పాటు! ఎరువుల ద్వారా ఈ సూక్ష్మక్రిముల్ని చంపే మనం సృష్టిలో అద్భుతమయిన ఏర్పాటుని ఎంతగా భంగపరుస్తున్నాం!

ఒక్కసారి కడుపు నిండాక - వారం రోజుల పాటు సింహానికి ఆహారం అవసరం లేదు. మనలాగే రోజూ మూడు పూటలూ తినే ఏర్పాటు జరిగిఉంటే - రోజుకిఎన్ని అడవి దున్నలు మాయమయేవి! అడవి అచిరకాలంలో స్మశానమయేది. కడుపు నిండిన సింహం పక్కనుంచే మందలు మందలుగా జంతువులు నడుస్తుంటాయి. అయినా అటువేపు దృష్టిని కూడా సారించదు సింహం!

ప్రస్తుతం 60 కేజీల మాంసాన్ని నంజుకున్న రెండు శివంగులు ఆపసోపాలు పడుతున్నాయి. ఒక శివంగి రక్తంతో ఎరుపెక్కిన మూతిని నాలికతో తుడుచుకుంటూ దగ్గర్లో ఉన్న చెరువు దగ్గరకి నడిచింది. నీరు తాగాక బద్ధకంగా సెవన్నా గడ్డిలో విశ్రమించింది. దాదాపు గంట పైగా అక్కడే ఆగిపోయాం. మాలాగే వచ్చిన మరికొందరి యాత్రికుల వాన్‌లు నిలిచి ఉన్నాయి. ఈ దృశ్యం ఒకరోజుకి, ఒక యాత్రకి సరిపోయేంత తృప్తినిచ్చింది.

మళ్ళీ జెనిసిస్ మోటల్‌కి వచ్చి స్నానాదికాలు, ఫలహారం ముగించుకుని బయలుదేరాం. అప్పటి అరణ్యం పూర్తిగా మేలుకుంది. బిలబిలమంటూ జిరాఫీలూ, చారల గుర్రాలూ, బబూన్లూ, ఏనుగులూ సంచరిస్తున్నాయి.

మధ్యాహ్నం చింతచెట్టు కిందకి చేరాం. మాకు రెండు వందల గజాల దూరంలో సింహం. ఇక్కడ మేం 'పులి'హోర, పెరుగన్నం సేవించాం. అవసరాలు మనుషులకీ, జంతువులకీ సహజమే. కానీ మరొక ప్రాణిని హింసించి పొట్టపోసుకునే జంతుప్రవృత్తిని ఇంకా మానవుడు కొనసాగిస్తున్నాడు. అదే ఆశ్చర్యం. చెట్టు వదిలిన ఫలాన్ని భుజించడం Evolved Species అయిన మానవుడు ప్రకృతికి చేసే ఉపకారం - కాదు - బాధ్యత.

హిప్పోల వీపు చర్మం పలచన. ఎండ వేడికి అంత శరీరం కుతకుతలాడిపోతుంది. కనుక రోజంతా నీటిలో మునిగే ఉంటాయి. రాత్రి ఏ నాలుగో ఝామునో బయటికి వచ్చి కావలసిన ఫలహారం చేసి (అవి శాఖాహారులు) మళ్ళీ నీటిలోకి తరలిపోతాయి. నీటి మట్టాన పెద్ద శరీరాలు తెలుస్తుంటాయి. హిప్పో పూల్ నిండా పది పైన హిప్పోలు తెలిశాయి.



మధ్యాహ్నానికి - రెండు శివంగులూ - మా వాన్ వెళ్ళే తోవ పక్కనే ఉన్న ఆకాశియా చెట్ల నీడకి చేరుకున్నాయి. ఇప్పుడు మాకూ వాటికీ పది గజాల దూరం. 30 - 40 కేజీల మాంసం కడుపులో బరువుగా ఉన్నది గావును - అది శరీరంలో ఇమడడానికీ వ్యవధికావాలేమో. నీడలో కూర్చుని అలసట పడుతున్నాయి, (మృష్టాన్న భోజనం చేస్తే శరీరంలో అలసట రావాలనేవాడు మా మిత్రుడు, అట్లూరి పుండరీకాక్షయ్యగారి సోదరుడు - బలరాం.) మేం కెమేరాలు బయటికి తీస్తే దగ్గర్లో ఉన్న శివంగి బద్ధకంగా మమ్మల్ని చూసింది. ఆ కళ్ళల్లో క్రౌర్యం, మత్తు మమ్మల్ని వణికించింది. ఒక్కసారి వాన్‌మీదకి లంఘిస్తే? ఏం భయం లేదని ధైర్యం చెప్పాడు డ్రైవర్ సైదీ.

సాయంకాలం వరకూ తిరిగినా మిగతా జీవరాశుల వైవిధ్యం కళ్ళబడింది కానీ ఉదయాన్ని మరిపించే దృశ్యం కనిపించలేదు. అంతకు మించి సింహం కనిపించలేదు. "శివంగుల్ని చూశాం కానీ మృగరాజు ఎక్కడ?" అనుకుంటూ మరునాడు మికూమి నుంచీ బయలుదేరాం.



(కొనసాగింపు వచ్చేసంచికలో